

గాంధీకి శుభాకాంక్షలు చెబుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, పార్టీ నాయకులు

పీఏసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గాంధీ

గచ్చిబౌలి, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): పీఏసీ చైర్మన్‌గా శాసనసభ కమిటీ ఆవరణలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రమాణ స్వీకారం శనివారం చేశారు. ఈ సందర్భంగా సభాపతి కార్యాలయంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ కార్యదర్శి సామ్యుల్ కార్తీక్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● శుభాకాంక్షల వెల్లువ

హైదర్‌నగర్: పీఏసీ చైర్మన్‌గా బాధ్యతలు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మోహన్‌గౌడ్, రవీందర్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, శోభన్, కాశీనాథ్‌యాదవ్, ఎండి ఇబ్రహీం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



శివాజీనగర్‌లో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య

ఓటరు నమోదుపై నిర్లక్ష్యం వద్దు

చందానగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని, నిర్లక్ష్యం వహించిన వారి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటరు నమోదులో మార్పు, చేర్పులు తదితర అంశాలపై జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశమయ్యారు. ఓటరు లిస్టు నమోదుపై నిర్లక్ష్యం చేయొద్దని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి, ఏఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్, కార్తీక్, కృష్ణ ఉన్నారు.

గచ్చిబౌలిలో బీఆర్‌ఎస్ ముఖ్య నేతల సమావేశం



మాట్లాడుతున్న కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈనెల 24న బీఆర్‌ఎస్ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌తో శేరిలింగంపల్లి ముఖ్యనాయకుల సమావేశంలో భాగంగా సన్నాహక సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాదవరం రంగారావు, రవియాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రామకృష్ణగౌడ్, చెన్నం రాజు, బాబుమియా, విజయలక్ష్మి, జమీర్, రాగం జంగయ్యయాదవ్, అంజమ్మ, సతీష్‌ముదిరాజ్, శంకరి రాజుముదిరాజు, అనిల్‌సింగ్ పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను తరలించాలి

అల్లాపూర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చెట్ల కొమ్మల్ని తులసినగర్, గాయత్రి నగర్‌లలో విద్యుత్ సిబ్బంది నరికివేశారు. అలా నరికిన కొమ్మల్ని పోగువేసి తరలించకుండా వదిలేయడంతో అక్కడ చెత్తకుప్పలా తయారయింది. ఇతరులు సైతం అక్కడే చెత్త వేయడంతో దోమలు పెరిగి ఇళ్లలోకి చేరుతున్నట్లు తులసీనగర్ కాలనీవాసులు వాపోతున్నారు. బల్దియా సిబ్బంది సైతం ఈ కేసు తమకేం సంబంధం లేదన్నట్లుగా చెట్ల కొమ్మల్ని, చెత్తను పట్టించుకోవడం లేదన్నా రు. ఇప్పటికైనా అధికారులకు తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

అల్లాపూర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రి నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యం లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఫోరం అధ్యక్షుడు సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ ట్యాంక్ పార్కు రోడ్డులో గల సీనియర్ సిటిజన్స్ భవనంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గాంధీనగర్‌లో వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో వైద్యులకు చూపించుకుంటున్న ప్రజలు

పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్‌లో మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గాంధీనగర్ మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి మంచి స్పందన వచ్చింది. ఈ శిబిరంలో 2 వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మీనాథ్, నాయకులు ఎల్లయ్య, రాములు, తిమ్మయ్య, శ్రీధర్, వెంకటసాయి, వైద్యులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సహకారంతో ముందుకు పోతున్నామని తెలిపారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను కాలనీలు, బస్తీవాసులు తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

షాపూర్‌నగర్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణలో భాగంగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ దగ్గర నుంచి షాపూర్‌నగర్ సాగర్‌హోటల్ వరకు రోడ్డు ఆక్రమణలో ఉన్నవ్యాపార సముదాయాలు, డబ్బాలను జీహెచ్‌ఎంసీ అధికారుల పోలీసులు ఆధ్వర్యంలో శనివారం ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ తొలగింపులో రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులు, నిరాశ్రయులయ్యారు. తమకు న్యాయం చేయాలని వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2 లక్షల సాయం

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): వసంతనగర్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్ తరఫున వరదసాయం కోసం రూ.2 లక్షల నిధులు సీఎంఆర్‌ఎఫ్‌కు అందజేసినట్లు కరస్పాండెంట్ క్రిష్ణవేణి తెలిపారు. తమవంతు సామాజిక బాధ్యతగా విద్యార్థులు, ఉపాధ్యాయులు విరాళాలు ఇవ్వడాన్ని ఆమె అభినందించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు అందరూ ఎంతో కొంత భాగస్వామ్యంతో వారికి కొంత ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తోటి వారికి సహాయం చేయాలన్న ఆలోచనలు రావడం, ఆచరణలో పెట్టడం తమ స్కూల్లో నేర్పిస్తామన్నారు.

వివాదాస్పదంగా గుడిసెల కూల్చివేత

- మియాపూర్ సర్వేనెంబర్ 100, 101లో 550 ఎకరాలపై కేసు
- ఫెన్సింగ్ ముందుకు జరిపి పేదల గుడిసెలు తొలగింపు
- గుడిసె వాసి ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో చికిత్స

మియాపూర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ పరిధిలోని సర్వేనెంబర్ 100, 101లో దాదాపు 550 ఎకరాలపైగా ఉన్న స్థలంలో పేదల గుడిసెలు హైడ్రా అధికారులు తొలగించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. గుడిసెలు కూల్చివేస్తున్న క్రమంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనికి సంబంధించిన విషయాలు ఇలా ఉన్నాయి. సర్వే నెంబర్ 100, 101లో గల స్థలం విషయంలో ప్రభుత్వం, ప్రైవేటు వ్యక్తులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపధ్యంలో సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. తుది తీర్పు వచ్చే వరకూ సదరు స్థలాన్ని హుడా ఆధీనంలోకి తీసుకుని కాపాడాలని హుడా, రెవెన్యూ అధికారులను కోర్టు ఆదేశించింది. ఇదిలా ఉండగా రెండు నెలల క్రితం వేలాది మంది పేదలు ఈ స్థలంలో గుడిసెలు వేయడానికి ప్రయత్నించడంతో హుడా, రెవెన్యూ యంత్రాంగం పోలీసుల సాయంతో అడ్డుకుని కేసులు నమోదు చేశారు. పలువురిని రిమాండ్‌కు తరలించారు. సదరు స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా రూ.5 కోట్ల నిధులతో ప్రభుత్వం ఫెన్సింగ్ ఏర్పాటు చేయించింది. లేఔట్ ప్రకారం సరిహద్దులు నిర్ణయిస్తుండగా ఈ స్థలాన్ని ఆనుకుని ఉన్న ఎంఏనగర్‌లో 35 మంది గుడిసెవాసులుకు నోటీసులు ఇచ్చారు. దీంతో అప్పట్లో వారు ప్రభుత్వానికి, అధికారులకు వినతులు ఇవ్వడంతో పాటు ఆందోళనకు దిగడంతో ఆ గుడిసెలను కూల్చకుండా వదిలేశారు. నాడు గుడిసెలు ఉన్న స్థలాన్ని వదిలేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మిగిలిన గుడిసెలు తొలగించాలని అధికారులు నోటీసులు ఇచ్చి శనివారం వాటిని తొలగించారు. ఈ క్రమంలో దుర్గయ్య, రేణుక కుటుంబానికి చెందిన గుడిసె కూడా తొలగిస్తారని చెప్పారు. అయితే తాము 20 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని, తమ గుడిసె తొలగించొద్దని అధికారులను వేడుకున్నారు. అయినప్పటికీ వారి గుడిసె తొలగించే ప్రయత్నం చేయగా దుర్గయ్య గుడిసెలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు రక్షించి ఆస్పత్రికి తరలించారు. ముందు ఫెన్సింగ్ వేసి మళ్లీ ఫెన్సింగ్ తొలగించి గుడిసెలు తొలగిచడం ఏమిటని గుడిసెవాసులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. సర్వేనెంబర్ 100, 101కు సంబంధించి కొంత భూమిని వదిలేసి ఆ తర్వాతనే ఫెన్సింగ్ వేశారన్నారు. తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని చూపించినా గుడిసెలు కూల్చివేసి కొత్తగా ఫెన్సింగ్ వేశారని వారు వాపోయారు. అధికారుల నిర్లక్ష్యంతోనే 50 నుంచి 60 ఎకరాల స్థలం కబ్జాలకు గురైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో పక్క 550 ఎకరాలు ప్రైవేటు స్థలంమని 18 సొసైటీలు ఉన్నత న్యాయస్థానంలో కేసు వేసి పోరాటం చేస్తున్నాయి. దీనిపై తుదితీర్పు వెలువడకుండా హుడా స్థలమని బోర్డులు ఎలా పెడతారని విమర్శిస్తున్నారు.



గుడిసె వద్ద రేణుక

దంపతుల ముసుగులో వ్యభిచారం

● జంట గుట్టురట్టు చేసిన పోలీసులు

అల్లాపూర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ ముసుగు తొడిగి వ్యభిచారం నడిపిస్తున్న జంటని సైబరాబా ద్ ఏహెచ్‌టీయు (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూ నిట్) రైడ్ చేసి పట్టుకున్న సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో ఓ ఫ్లాట్‌లో అద్దెకు ఉంటున్న వంశీ కృష్ణ(29), పార్వతిలు కొంతకాలంగా దంపతులుగా చలామణి అవుతూ ఉన్నారు. పార్వతి వ్యభిచారం కేసులో చిక్కుకోవటంతో స్థానికంగా చర్చనీయాంశం అయింది. సైబరాబాద్ ఏహెచ్‌టీయూ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ఇద్దరు గతంలో కూడా మాదాపూర్ ఇతర ప్రాంతాల్లో వేర్వేరు కేసులో పట్టుబడ్డారు. పార్వతి జైల్లో వేసినా వ్యభిచారం వదల్లేదని తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన వంశీ కృష్ణ అలియాస్ ప్రవీణ్ అలియాస్ నాని కూడా జల్సాలకు అలవాటు పడి తన నైపుణ్యంతో పాటు పార్వతి లాగిన్‌తో సోషల్ నెట్‌వర్కింగ్ ద్వారా విటులను ఆకర్షించేవాడు. కొత్త కస్టమర్స్‌ను ఆకర్షించేందుకు పాత వారచే తమ సర్వీసు బాగుందంటూ టెస్టిమోనిల్స్ కూడా టెలిగ్రాం, వాట్సాప్‌లలో రాయించుకునేవారు. శుక్రవారం జరిపిన రైడ్‌లో వీరిద్దరితో పాటు ఒక విటుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, 5 మొబైల్ ఫోన్లు, రూ.6,280 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పిటా కేసు నమోదు చేశారు.

హారన్ కొట్టి కారు తీయమన్నందుకు కత్తితో దాడి

కేపీహెచ్‌బీకాలనీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): హారన్ కొట్టి కారు తీయమంటావా అంటూ ఓ వ్యక్తి ఇద్దరు యువకులపై కత్తితో దాడి చేశాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్కంపేట్ ప్రాంతంలో నివాసం ఉండే జగ్‌జ్యోత్‌సింగ్ తన స్నేహితులు పెట్టిన గణేశ్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు కూకట్‌పల్లికి వచ్చాడు. శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో రామయ్యనగర్‌లో కారు నిలిపి ఉండగా.. వెనకాలే వచ్చిన అవినాష్, నవీన్ మరో కారులో హారన్ కొడుతూ వచ్చారు. ఎవరూ కారు తీయకపోవడంతో కారు దిగి వచ్చి ఏంటి? అర్థం కావడం లేదా అంటూ అరవడంతో ఇరువురు కొట్టుకున్నారు. కోపోద్రిక్తుడైన జగ్‌జ్యోత్‌సింగ్ తన వద్ద ఉన్న కత్తితీసి వారిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు జగ్‌జ్యోత్‌సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై సెక్షన్ 307 కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించే పనిలో పోలీసులు ఉన్నారు. చిన్నపాటి గాయాలేకావడంతో రాందేవ్‌రావు హాస్పిటల్‌లో ఓపీ ద్వారా చికిత్స తీసుకుని ఇంటికి వెళ్లారని పోలీసులు తెలిపారు.

ఆలయాల్లో సంకష్టహర చతుర్థి పూజలు

భెల్‌కాలనీ: సంకష్టహర చతుర్థి సందర్భంగా బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్, ఎంఐజీకాలనీలల్లోని పలు వినాయక ఆలయాల్లో నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు జరిగాయి. అయప్పస్వామి దేవాలయం, సాయిబాబా ఆలయం, వేంకటేశ్వర దేవస్థానంలో గల వినాయక అంతరాలయాల్లో విశేష అభిషేకాలను నిర్వహించారు. గణనాధునుడికి గరకపూజు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో మురుగు పరుగు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ ప్రజలు మురుగు సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. నూతనంగా బస్తీలు, కాలనీలు ఏర్పాటు కావడంతో అప్పటి జనాభాకు అనుగుణంగా వేసిన పైప్‌లైన్‌లు, మురుగు నీటి పైప్‌లైన్‌లు ఇప్పుటి జనాబా సామర్థ్యానికి సరిపోకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మురుగు రోడ్లపై పారుతుంది. షాపూర్ నగర్ నుంచి పేట్‌బషీరాబాద్‌కు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో శ్వేత ఆర్యన్ అపార్టుమెంట్ ఎదురుగా మురుగు నీరు పొంగి కిలోమీటర్ల మేర పారుతుంది. అదే రోడ్డులో కోణార్కు ఆస్పత్రి సమీపంలో పాదాచారులు నడిచే బాటలో మురుగునీరు చేరి తీవ్ర దుర్గధం వెదజల్లుతోంది. గతంలో ఈప్రాంతంలో సుభాష్‌నగర్ నాలా వరకు 4 వందల ఎంఎం డయా పైప్‌లైన్ వేశారు. ప్రస్తుత జనాభావసరాలకు ఆ పైప్‌లైన్ సరిపోవడం లేదు. ఈ దారిలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు స్పందించి మురుగు నీటి పైప్‌లైన్ పనులను తొందరగా పూర్తి చెయ్యాలని సంబందిత అధి కారులను కోరుతున్నారు. ఈ విషయంపై జలమండలి డీజీఎం రాజేష్‌ను వివరణగా కోరగా పాత పైప్‌లైన్ మార్గంలో నూతన పైప్‌లైన్ వెయ్యాలి, ఆ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయి. ఈ విషయం విద్యుత్ అధికారులకు స్తంభాలను తొలగించాలని లెటర్ ఇచ్చామని, త్వరలోనే మురుగు నీటిని కట్టడి చేస్తాం.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక



బండి రమేష్‌తో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుష్పారెడ్డి, కమిటీ సభ్యులు

బాలానగర్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాలానగర్‌కు చెందిన సీనియర్ మహిళా నాయకురాలు కొండకంద పుష్పారెడ్డి నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా కైత్లాపూర్‌కు చెందిన ప్రకాష్‌ముదిరాజ్‌తో పాటు 17 మంది సభ్యులు (డైరెక్టర్లు) నియామకం జరిగింది. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. పార్టీ కోసం పని చేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని చెప్పడానికి ఇదే నిదర్శనం అన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొండకింది పుష్పారెడ్డి మాట్లాడుతూ.. పీజేఆర్ నాటి నుంచి పార్టీ మారకుండా కాంగ్రెస్ జెండా మోస్తున్న తనను అధిష్ఠానం గుర్తించి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. తన పదవి కోసం కృషి చేసిన నేతలు, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, లక్ష్మయ్య, తూము వేణు, సంతోష్, కే. రమేష్, శివచౌదరీ, బచ్చుమల్లి పాల్గొన్నారు.

● 1978లో ఎమ్మెల్యే పీజేఆర్, మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ ప్రోత్సలంతో భరత్‌నగర్ మార్కెట్ ఏర్పాటు చేయబడిందని అప్పటి నుంచి నేటి వరకు మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులుగా ఉన్న తమకు కమిటీలో అవకాశం కల్పించక పోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



లక్నోటూర్‌లో అక్కడి అధికారులతో మేయర్, కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్

లక్నోటూర్‌కు వెళ్లిన కార్పొరేటర్లు

రాయదుర్గం, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి గ్రేటర్ హైదరాబాద్ నుంచి 50 మంది కార్పొరేటర్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి వెళ్లిన వారిలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఉన్నారు. అక్కడ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న మౌలిక సదుపాయాలు, జరుగుతున్న అభివృద్ధి పనులను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన ఉషోదయాకాలనీవాసులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

గాజులరామారం, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ ఉషోదయా కాలనీలో నెలకొన్న సమస్యలను కాలనీవాసులు ఇటీవల మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన వారు ఉషోదయా కాలనీలో అభివృద్ధి కొరకు రూ. 64 లక్షలు మంజూరి చేశారు. దీంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పైప్‌లైన్, రోడ్డు ప్యాచ్ వర్కులు చేయనున్నారని వారు తెలిపారు. కాలనీవాసులు కలిసి శనివారం శ్రీశైలంగౌడ్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, బాల్‌రెడ్డి, గురుప్రసాద్, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసిన భెల్ ఎస్సీ అసోసియేషన్ కార్యవర్గం

భెల్‌కాలనీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, ఎంపీ ప్రసాదరావును బీహెచ్‌ఈఎల్ ఎస్సీ ఎంప్లాయిస్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన భెల్ ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన నూతన కార్యవర్గ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యుడు ప్రసాద్‌రావు మాట్లాడుతూ జాతీయ కమిషన్ భెల్ ఎస్సీ అసోసియేషన్‌కు అండగా ఉంటుందని, ఎస్సీల హక్కుల సాధన కోసం అసోసియేషన్ కృషి చేయాలని కోరారు. భెల్ ఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సురేందర్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమం, కర్మాగార అభివృద్దే అసోసియేషన్ ప్రధాన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవా అర్జున్, మాజీ అధ్యక్షులు మనోజ్, బాలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెన్నై నుంచి లారీ లోడ్‌తో డ్రైవర్‌లాల్ సింగ్, క్లీనర్ రూప్‌సింగ్ ఈనెల 18న మేడ్చల్‌లోని దేవరాంజల్ గ్రామంలోని ఓ గోదాంలో లోడ్‌ను దిగుమతి చేసేందుకు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో లారీని పక్కన నిలిపారు. భోజనం కోసం పెట్రోల్‌బంక్ సమీపంలోని ఓ హోటల్ వద్దకు క్లీనర్ రూప్‌సింగ్ నడుచుకుంటూ వెళ్తున్నాడు. మార్గమధ్యలో వెనక నుంచి వేగంగా వచ్చిన ఓ ప్రైవేట్ బస్సు ముందు వెళుతున్న ఆటో ట్రాలీని ఢీకొట్టడంతో నడుచుకుంటూ వెళుతున్న రూప్‌సింగ్ రోడ్డు పక్కనే నిలిపి ఉన్న మరో ట్రాలీ ఆటో మధ్యన ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన స్థానికులు క్లీనర్ వద్ద ఉన్న ఫోన్‌తో డ్రైవర్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వచ్చిన డ్రైవర్ క్లీనర్ మృతి చెందడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

దేశం అభివృద్ధి రాహుల్‌గాంధీకి కనపడడంలేదా?

నిజాంపేట్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): అమెరికా గడ్డపై భారతదేశ ప్రతిష్ఠను, రాజ్యాంగాన్ని, సార్వభౌమధికారాన్ని అసభ్యకరంగా కాంగ్రెస్ పార్టీ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడడం సిగ్గుచేటని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని హనుమాన్ దేవాలయం అంబేడ్కర్ విగ్రహం దగ్గర బీజేపీ అర్బన్ ఎస్సీ మోర్చ అధికార ప్రతినిధి దాసి నాగరాజు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఉందన్నారు. రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని , ప్రజలకు క్షమాపన చెప్పాలన్నారు. మిడియాసెల్ కన్వీనర్ సుమాన్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి వత్స చక్రధర్, స్వచ్ భారత్ కన్వీనర్ సిల్వారెడ్డి, నిజాంపేట్, బాచుపల్లి అధ్యక్షులు భిక్షపతియాదవ్, ప్రసాద్‌రాజు, ఎన్‌ఎంసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు కొనుగోలు చేసిన ముగ్గురి రిమాండ్

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలను కొనుగోలు చేసి వెంట తెచ్చుకున్న ముగ్గురిని పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు శనివారం తరలించారు. ఎస్ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ కండ్లకోయకు చెందిన ఎ.శరణ్‌రెడ్డి (34)వ్యాపారి. వనస్థలిపురానికి చెందిన కె.పవన్‌కుమార్(40) వ్యాపారం, బాచుపల్లికి చెందిన డి. శివశంకర్‌రెడ్డి (34)సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తాడు. వీరంతా ఇటీవల గోవాకు వెళ్లి మత్తు ఎండీఎంఏ పదార్థాలను లను తీసుకొచ్చారు. పేట్‌బషీరాబాద్ పోలీసులకు అందిన సమాచారంతో కారును సెయింట్‌యాన్ స్కూల్ సమీపంలో పోలీసులు కారు ఆపి, రెండు గ్రాముల మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పేట్‌బషీరాబాద్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెన్నారెడ్డి, రంగారెడ్డినగర్ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న 34 మంది ఉపాధ్యాయులను చేయూత ఫౌండేషన్, చెన్నారెడ్డినగర్ డెవలప్‌మెంట్ సభ్యులు శాలువాలతో సన్మానించారు.



ఉపాధ్యాయులను సన్మానించిన సంస్థ సభ్యులు

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

భెల్‌కాలనీ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా కొనసాగుతోందని అసెంబ్లీ సభ్యత్వ ప్రముఖ్ తోపుగొండ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎంఐజీకాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన శనివారం మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో అసెంబ్లీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ పర్యవేక్షణలో ఉత్సాహంగా సభ్యత్వ నమోద చేపట్టినట్లు తెలిపారు. సామాన్య కార్యకర్త జాతీయ నాయకుడిగా ఎదగాలంటే ఒక్క బీజేపీలోనే సాధ్యమని తెలిపారు. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్న సంస్కరణల వల్లనేడు భారతదేశం ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. నియోజకవర్గంలో రెండు లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

జన్యు, పర్యావరణ, జీవనశైలితోనే మతిమరుపు



కరపత్రాన్ని విడుదల చేస్తున్న వైద్యులు

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మతిమరుపు (అల్జీమర్స్) వ్యాధి అనేది ముఖ్యంగా జన్యు, పర్యావరణ, జీవనశైలి కారణాలవల్ల కలుగుతుందని, దీనివల్ల మెదడు కణజాలాన్ని కోల్పోవడం కాకుండా కణాల మధ్య పనితీరు కమ్యూనికేషన్ కోల్పోయేలా చేస్తుందని టీఎస్‌బీ మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ కమిటీ చైర్మన్ డాక్టర్ జార్జిరెడ్డి అన్నారు. శనివారం ప్రపంచ మతిమరుపు దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని మానసిక ఆస్పత్రిలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ గణాంకాల ప్రకారం ప్రతీ సంవత్సరం మతిమరుపు వ్యాధితో లక్షకు పైగా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. అయినప్పటికీ మతిమరుపు అసోసియేషన్ ప్రకారం 65 సంవత్సరాలు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారిలో అల్జీమర్స్ వ్యాధి మరణానికి ఐదో ప్రధాన కారణమని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా మతిమరుపు, మధుమేహం, బీపీ, వ్యాదులు పెరుగుతున్నాయని దీనికి అధికంగా మత్తు పదార్థాలు వాడడం కారణమన్నారు. ఈ సందర్భంగా మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అనిత మాట్లాడుతూ మతిమరుపు వ్యాధి అనేది మానసిక రోగుల్లోనే కాకుండా సాధారణ వ్యక్తుల్లో కూడా సంభవిస్తుందన్నారు. ఈ మతిమరుపు వ్యాధికి మందులు ఉన్నాయని, వాటికన్నా దైనందిన జీవిత విధానంలో మార్పులు చాలా ఫలితాన్ని ఇస్తాయన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ గిరిప్రసాద్ మాట్లాడుతూ మతిమరుపు రాకుండా ఉండడానికి ఎక్కువగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మెదడుకు పనికల్పించే పనులు చేయాలని, కొత్త రకం వంటలు ప్రయత్నించడం, చిన్నపిల్లలను పెంచడం లాంటివి చేస్తే బ్రెయిన్ చాలా ఉత్తేజమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన వైద్య విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మానసిక ఆసుపత్రి సైకాలజీ విభాగం అధిపతి డాక్టర్ సుధా, మెడికల్ సైకాలజిస్టు వెంకటసుబ్బయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.